క్లుప్తంగా

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం రంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. వేద పండితులు వికాస్ మిశ్రా, రామానుజాచార్యులు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తలు పాత్తూరి సుబ్బారావు, వెంకటరమణ దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. దంపతులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పౌరాణిక నాటక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భజనలు నిర్వహించారు.

అ'పూర్వ' కలయిక



అచ్చంపేట: స్థానిక తుమ్మే శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలులో 2004–2005లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా పాఠశాలలో ఆదివారం కలశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ హోదాలలో స్థిరపడిన పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని, సంతోషపడ్డారు. తరగతి గదులను కలయ తిరిగారు. వారికి పాఠాలు చెప్పిన గురువులను గౌరవించుకున్నారు. పాఠశాల ఆవరణలోనే సహపంక్తి భోజన చేశారు.

బహుమతుల ప్రదానం



సత్తెనపల్లి: సంక్రాంతి సందర్భంగా వెన్నాదేవి గ్రామంలో సత్తెనపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 6 నుంచి 15 సంవత్సరాల బాల బాలికలకు పది రకాల ఆటల పోటీలు ఇటీవల నిర్వహించారు. విజేతలకు రోటరీ క్లబ్ కోశాధికారి వనమా నాగేశ్వరావు సహకారంతో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాతంగి సాంబశివరావు, సెక్రటరీ సరికొండ రమాదేవి, ట్రెజరర్ వనమా నాగేశ్వరరావు, జోనల్ చైర్మన్ బెల్లంకొండ. నాగ సాయిప్రసాద్, స్వామినాథన్ బాలసుబ్రహ్మణ్యం, శ్రీధర్‌బాబు, రవిచంద్రన్, ధనలక్ష్మి, గణపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పునఃనిర్మాణ పనులు ప్రారంభం

కారెంపూడి: కారెంపూడిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక ఇందిరా నగర్ కాలనీ నుంచి బస్టాండ్ సెంటర్‌లోని పోలీస్ కాంప్లెక్స్ వరకు దెబ్బతిన్న రోడ్డు బీటీ లేయర్‌ను తొలగించి, రోడ్డును చదును చేశారు. దానిపై మెటల్ లేయర్‌ను పరచి చదును చేస్తున్నారు. దీంతో కారెంపూడిలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము సమస్య తీరింది. ఇదిలా ఉంటే నరసరావుపేట నుంచి మాచర్ల వెళ్లే ప్రధాన రహదారిలో మండలంలోని పేటసన్నెగండ్ల బ్రిడ్జి నుంచి నరమాలపాడు గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేయిస్తున్నారు. మొత్తం 9 కిలోమీటర్ల పొడవున్న రోడ్డు పునర్నిర్మాణ పనులు ప్రస్తుతం కారెంపూడిలో జరుగుతున్నాయి. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం జరగనుందని, మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

బోయపాలెంలో పెంకుటిల్లు దగ్ధం

యడ్లపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. బోయపాలెం ఏటీఎం సమీపంలో ఆకి వీరబ్రహ్మానికి చెందిన ఇంటిని ప్రత్తిపాడుకు చెందిన చిన్న నరేష్ అద్దెకు తీసుకుని, కుటుంబంతో పాటు అందులోనే షామియానా సామన్లు బాడుగకు ఇస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పెంకుటింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక అధికారి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

భోగి వెలుగులు.. ముగ్గుల వాకిళ్లు

కణ కణ రవ్వలు.. చీకటిని చీల్చే వెలుగులు.. పాతను వదిలి కొత్తకు ఆహ్వానాలు.. పిల్లాపాపల కేరింతలు.. తెలుగువారి సంస్కృతిని చాటే భోగి భాగ్యాల వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో వేడుకగా నిర్వహించారు. ఆదివారం భోగి కావడంతో పట్టణాల నుంచి బంధువులు, మిత్రులు కుటుంబ సమేతంగా పల్లెలకు తరలివచ్చారు. కొత్త అల్లుళ్లతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. కుటుంబ సభ్యులంతా ఒక చోటకు చేరి ఆనందంగా గడుపుతున్నారు. హరిదాసుల హరినామ కీర్తనలతో వీధులు సందడిగా మారాయి. మహిళలు పోటీపడి ఇళ్ల ముంగిట రంగ వల్లులు తీర్చిదిద్దుతున్నారు. దీంతో అంతటా సంక్రాంతి శోభ వెల్లివిరుస్తోంది.

- సంక్రాతి సంబరాలు ప్రారంభం
- భోగి మంటల వద్ద యువత, చిన్నారుల సందడి
- వెల్లివిరుస్తున్న సంస్కృతి సంప్రదాయాలు

సత్తెనపల్లి: శీతాకాలపు చలి, తొలి మంచు తెరలు చాటున యువకులు ఊరూరా భోగిమంటలు వేశారు. వేకువజామునే నిద్రలేచి సేకరించిన కలపతో మంటలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ మంటల వద్ద చిన్న, పెద్ద సందడి చేశారు. పిల్లలు భోగి పిడకల దండలను మంటల్లో వేశారు. ఇది ఇలా ఉంటే ప్రతి ఇంట పిండివంటలు ఘుమఘుమలాడుతున్నాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సత్తెనపల్లి పట్టణంలోని గాంధీ చౌక్ సెంటర్‌లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి వేడుకను ఘనంగా నిర్వహించారు. బంజారా మహిళలు, కళాకారులతో కలిసి నియోజకవర్గ ప్రజలను ఉత్సాహపరిచేందుకు ఆయన స్టెప్పులతో కూడిన డ్యాన్స్ చేశారు. పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం ఎదుట భోగి మంటలు వేశారు. అమ్మవారికి మోహిని అవతారంలో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవారి దగ్గర దీపారాధన నిర్వహించగా శిలింగం, మందార పువ్వులో వినాయకుడు రూపం రావడం విశేషమని పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ శాస్త్రి తెలిపారు. పట్టణంలోని రఘురామ్‌నగర్, నాగార్జున నగర్, రైల్వే స్టేషన్ రోడ్, సుందరయ్య కాలనీ, వడ్డవల్లి పాత బస్టాండ్ ఇలా ప్రతి వీధిలోనూ భోగి మంటలు వేశారు. సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లోనూ భోగి మంటలు వేశారు. ప్రజలు వేకుజామునే స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

వేడుకగా లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

నకరికల్లు: స్థానిక కొండపై ఉన్న చెంచులక్ష్మి ఆదిలక్ష్మి సమేత లక్ష్మీనర్సింహ స్వామి గ్రామోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామివారి గామోత్సవం కనుల పండువగా సాగింది. స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం పుర వీధుల్లో ఊరేగింపుగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీరిన స్వామివార్ల ఉత్సవ మూర్తులు పుర వీధుల్లోకి రాగా మహిళా భక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. అర్చకులు కొడవటి కంటి మధుసూదనాచార్యులు, పాండు రంగాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

హరిదాసు గానం

నకరికల్లు: పల్లెల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. హరిదాసులకు అక్షయ పాత్రలో ధాన్యం, బియ్యం, కూరగాయలు సమర్పించి, దీవెనలు స్వీకరించారు. యువత గ్రామాల కూడళ్లలో భోగిమంటలు వేశారు.

ముప్పాళ్ళ: మండలంలో భోగి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయాలకు ప్రతీకగా తెల్లవారుజామున పెద్దపెద్ద భోగి మంటలు వేసి పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, సంక్రాంతి పండగ ప్రతి కుటుంబంలో ఆనందం నింపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం గుంటూరులోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు భోగి. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



గాంధీ చౌక్‌లో కోలాహలంగా భోగిమంటలు



మోహినీ అవతారంలో అమ్మవారి గ్రామోత్సవం



కుటుంబ సభ్యులతో భోగి వేడుకల్లో ఎమ్మెల్యే నంబూరు



హరిదాసుకు దానం సమర్పిస్తున్న మహిళ



క్రోసూరు విద్యానగర్‌లో భోగిమంటలు వేస్తున్న యువత



ముప్పాళ్ళలో భోగి మంటలు



నకరికల్లులో లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

గుర్తు కొస్తున్నాయి..!



బృగుబండ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

26 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

సత్తెనపల్లి: బృగుబండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. రెండున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న తమ స్నేహితులందరినీ ఒకచోట కలిపేందుకు పూర్వ విద్యార్థులు లాకు పిచ్చియ్య, జక్కా నరసింహారావు, మేకల అంకమ్మరావు, ఇ.అన్నపూర్ణ, జి.నాగలక్ష్మి నెల రోజులుగా సామాజిక మాధ్యమాల ద్వారా ఒకరినొకరు సంప్రదించుకొని అదే పాఠశాలలో కలుసుకున్నారు. మిత్రులను చూసి అందరూ ఆనందపడ్డారు. చిన్ననాటి సంగతులను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. అప్పట్లో విద్యా బోధన చేసిన 15 మంది ఉపాధ్యాయులను ఆహ్వానించి, సత్కరించారు. మృతి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు, నలుగురు విద్యార్థులను గుర్తుచేసుకుని సంతాపం తెలిపారు. చివరిగా ఒకరి నొకరు హత్తుకొని మళ్ళీ మనం కలుసు కోవాలంటూ వీడ్కోలు పలికారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్నబాబురావు, జైపాల్

సత్తెనపల్లి: రాజ్యాధికారం ద్వారానే దళితుల అభివృద్ధి సాధ్యమని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆచరణలో పెట్టారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలకా జైపాల్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత పార్టీలు, ప్రభుత్వాలు కేవలం రిజర్వేషన్లలో మాత్రమే దళితులకు అవకాశం కల్పించారని, అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నియామక పదవుల్లోనూ, కాంట్రాక్ట్ కమిటీల్లోనూ దళిత వర్గాలకు సింహభాగం కేటాయించారన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు సంకటి శ్యాంసన్, కోడిరెక్క దేవదాస్, జూపల్లి పాల్, ఆనంద్, కోటేశ్వరరావు, రమేష్, గుజ్జర్లపూడి కృపాకర్, శ్రీనివాస్, సీతా రామయ్య పాల్గొన్నారు.

కల్యాణం... కమనీయం

వైభవంగా గోదా రంగనాయకుని పరిణయోత్సవం




వడ్డవల్లిలో గోదా రంగనాయకుల కల్యాణ ఘట్టం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీరామాలయం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదా రంగనాయకుల స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుప్రభాతంతో మేల్కొల్పి అభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామార్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదా రంగనాయకుని పట్టు పీతాంబరాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. తదుపరి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేపట్టి ఉభయదారులకు కంకణ ధారణ చేశారు. అర్చకుల నేతృత్వంలో పరిణయోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకోదండరామ స్వామిని చందనంతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించి భగవంతుని కృపకు పాత్రులయ్యారు. కళ్యాణమహోత్సవానికి హాజరైన భక్తులందరికీ ఆలయ ప్రాంగణం లో అన్న సంతర్పన చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు గోదా రంగనాయకస్వామి కల్యాణోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ఐదులాంతర్ల సెంటర్‌లో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం గోదా రంగ నాయక స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి రంగిశెట్టి సూర్య నారాయణ ఆదివారం తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు, మంగళ సూత్రాలు, మెట్టెలను వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు భార్య కృష్ణకుమారి అందిస్తున్నారన్నారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతి ఇంటికి అక్షింతలు



దుర్గి: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వారి నుంచి అందుకున్న పవిత్ర అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో స్థానిక గ్రామ పెద్దలు హిందూ బంధువులు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మాచర్ల మెయిన్ రోడ్డులోని కాశి నాయన ఆశ్రమం నుంచి రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అక్షింతలను గ్రామంలో ప్రతి ఇంటికి అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొబ్బ సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నారని అన్నారు. నాయకులు వరహాల రెడ్డి, లింగయ్య, అంబారావు, సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్.ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



వాలీబాల్ జట్టు సభ్యులతో ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా యాజమాన్యం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడులో ఉన్న ఆర్.ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ వారి రెయిన్‌బోసిటీ వెంచర్ నందు సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొనగా సత్తెనపల్లి, మాచర్ల, జొన్నలగడ్డ, నరసరావుపేట క్రిష్ణవేణి డిగ్రీ కాలేజీ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ఆర్.ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నాగండ్ల రాంబాబు మాట్లాడుతూ ఫైనల్స్‌లో గెలిచిన జట్టుకు రూ.20,116, రన్నర్స్‌కు రూ.15,116లు, రెండవ రన్నర్స్‌కు రూ.10,116లు, మూడవ రన్నరప్‌కు రూ.5,116లు క్యాష్ బహుమతితో పాటుగా మెమెంటో అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట బ్రాంచ్ ఇన్‌చార్జ్ ఎం.రాజేష్, టోర్నమెంట్ ఆర్గనైజర్ కోటేశ్వరరావు, ఆసుల శేఖర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గురజాల : అక్రమంగా మద్యం, నగదు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఈబీ ఎస్ఐ జయరాం, సివిల్ ఎస్ఐ అశోక్ ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. దాచేపల్లి నుంచి మాచర్ల వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

●తెల్లవారినా.. మంచు వీడదే..!



పల్లెలను మంచు దుప్పటి కప్పేస్తోంది. ధనుర్మాసం విపరీతమైన పొగ మంచు ముంచేస్తోంది. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారితో పాటు గ్రామాల్లోనూ మంచు తెరల చాటునే వాహన ప్రయాణాలు సాగాయి. లైట్లు వేసుకొని రోడ్లపైకి తిరగాల్సిన పరిస్థితి. పై చిత్రంలో దృశ్యం చల్లగుండ్ల గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలోనిది. ఎదురుగా మనుషులు, వాహనాలు, చెట్లు కూడా కంటికి స్పష్టంగా కనిపించనంతంగా మంచు కమ్ముకుంది. – నకరికల్లు

విజేత డౌన్‌మార్కెట్ టీం

విజయపురిసౌత్: స్థానిక జింఖానా గ్రౌండ్‌లో ఓలేటి సురేష్ జ్ఞాపకార్థం భీమవరపు వెంకటరమణ, భవిరి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో డౌన్‌మార్కెట్ టీం విజేతగా నిలిచింది.